ఉల్లాసంగా.. ఉత్సాహంగా

విజయనగరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యువకుల్లా పరుగులు తీశారు.. కబడ్డీలో కూతలు పెట్టారు.. చెస్‌లో ఎత్తుకుపైఎత్తులు వేశారు. టెన్నిస్.. వాలీబాల్.. హాకీ తదితర క్రీడల్లోనూ సత్తా చాటారు.. రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో నువ్వానేనా అన్నట్లు బలాబలాలను ప్రదర్శించారు.. పోటీలు మొదలైనప్పటి నుంచి చివరి వరకూ అదే ఉత్సాహం కనబరిచారు.. క్రీడాస్ఫూర్తిని చాటారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ క్రీడా మైదానంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం మంగళవారం ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి 200 మంది ఉద్యోగులు హాజరయ్యారు. పోటీలను డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు.





బంగారు భవితకు పొదుపు

జేబులో నాలుగు రూపాయలు చేరగానే మూడు రూపాయలు పర్సులో దాచుకుంటారు కొందరు.. అందిన జీతంలో సగానికి పైగా బ్యాంకు ఖాతాకు మళ్లించుకుంటారు ఇంకొందరు.. రోజువారీ చిట్టీలు కడుతుంటారు.. కొద్దికొద్దిగా కూడబెట్టుకుని బంగారం కొంటారు.. ఇంకా ఎక్కువ మొత్తం పోగేసి భూములు కొంటారు.. పొదుపును బంగారు భవితకు మదుపుగా భావించే వారంతా ఈ పంథాను అనుసరించడం చూస్తుంటాం. నేడు బాగున్నాం.. రేపు ఇంకా బాగుండాలన్న ఆశావహ దృక్పథమే మనిషిని పొదుపు మార్గంలో తీసుకువెళ్తుంది. భవిష్యత్‌లో ఎదురయ్యే ఒడిదొడుకులను సులువుగా ఎదుర్కోవాలన్నా పొదుపు కీలకం. అందుకే పొదుపు ఓ తారకమంత్రంగా ఆర్థిక వేత్తలు చెబుతుంటారు. పొదుపు చేసి చూడు అని సూచిస్తుంటారు. ప్రపంచ పొదుపు దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం.. 8లో

వైసీపీ సర్కారు పాపం!

● పెరగనున్న విద్యుత్ చార్జీలు ● అప్పటివి ఇప్పుడు సర్దుబాటు ● జిల్లా ప్రజలపై రూ.5 కోట్ల భారం





విజయనగరం/ రింగురోడ్డు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రజలపై మరో బాదుడు తప్పేలా లేదు. వచ్చే నెల నుంచి విద్యుత్ చార్జీలు పెరగనున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఇప్పటికే చార్జీలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇప్పుడేమో నవంబరు నుంచి విద్యుత్ చార్జీలు మరింత పెరగనున్నాయని తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. 15 నెలల పాటు విద్యుత్ చార్జీల పెంపునకు డిస్కంలకు అనుమతి లభించింది. వాస్తవానికి విద్యుత్ చార్జీలు పెంచకూడదని కూటమి ప్రభుత్వం భావించింది. ఇదే విషయాన్ని చంద్రబాబు సైతం ఎన్నికల ముందు నుంచే చెబుతూ వచ్చారు. అయితే జగన్ సర్కారు నిర్వాకం పుణ్యమా అని పెంచక తప్పని పరిస్థితి కూటమి ప్రభుత్వానిది. జగన్ సర్కారు అనాలోచిత నిర్ణయాలు, నిర్లక్ష్యంతోనే చార్జీలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. గతంలో జగన్ సర్కారుకు డిస్కంలు ఎన్నేరకాల ప్రతిపాదనలు చేసినా బుట్టదాఖలు చేశారు. దీంతో రూ.6,072.86 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయి. వాటిని సర్దుబాటు చేయాల్సిన అనివార్య పరిస్థితి కూటమి ప్రభుత్వంపై పడింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు సర్దుబాటు చార్జీలను 15 నెలల పాటు వసూలు చేసే పరిస్థితి కనిపిస్తోంది. అదే జరిగితే 2026 జనవరి వరకూ విద్యుత్ చార్జీలతో పాటు అదనపు బాదుడు తప్పదేమో.

ప్రజలపై భారం..

ఉమ్మడి జిల్లాలో సుమారు 9 లక్షల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తాజాగా పెరిగిన చార్జీలతో జిల్లా ప్రజలపై రూ.5 కోట్ల అదనపు భారం పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. టీడీపీ హయాంలో తక్కువ మొత్తంలోనే విద్యుత్ చార్జీలు వసూలు చేసేవారు. చార్జీలు పెంచిన దాఖలాలు కూడా లేవు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎడాపెడా చార్జీలు పెంచారు. విపక్షాలు, ప్రజాసంఘాలు పోరాటానికి సిద్ధమైనా ఉక్కుపాదం మోపారు. వైసీపీ హయాంలో విద్యుత్ వినియోగం మిగతా 10వ పేజీలో..



పొంచి ఉన్న ముప్పు

● నిబంధనలకు తిలోదకాలు
● రోడ్డుకు ఇరువైపులా బాణసంచా దుకాణాలు
● ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?



దుకాణం వద్ద గుమిగూడిన జనం

● విజయనగరం నుంచి పార్వతీపురం, సాలూరు, ఒడిశా వెళ్లే జాతీయ రహదారి-26పై నిత్యం అధికంగా ట్రాఫిక్ ఉంటుంది. ఇదే మార్గం గుండా అంబులెన్స్‌లు, పెట్రోలియం ప్రొడక్టు వాహనాలు, భారీ వాహనాలు, బస్సులు, స్కూల్ బస్సులు వెళ్తుంటాయి. పైగా జాతీయ రహదారికి ఇరువైపులా బాణ సంచా అమ్మకాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవటంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అగ్నిప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరో!

విజయనగరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాణసంచా హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలకు విజయనగరం కేరాఫ్‌గా పేరొందింది. ఏటా వందల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతంది. గత ఐదేళ్లలో ఇక్కడ అధికారంలో ఉన్న కీలక ప్రజాప్రతినిధి బంధువు తన మార్కు హవాను చూపించి వ్యాపారం తన గుప్పిట్లో పెట్టుకున్నారు. దీంతో పాటు వ్యాపారస్తుల్లో అనేక మంది ఆ ప్రజాప్రతినిధి సామాజిక వర్గానికి చెందినవారు ఉండేవారు. నిబంధనలు అతిక్రమించినా అటువైపు అధికారులను కన్నెత్తి చూడనిచ్చేవారు కాదన్న విమర్శలు బహాటంగా వ్యక్తమయ్యేవి. ఈ ఏడాది నిబంధనలు ఖచ్చితంగా అమలు చెయ్యాలని భావించటంతో గత రెండురోజులుగా రిటైల్ దుకాణాలకు అధికారులు అనుమతి ఇవ్వలేదు. సోమవారం కూడా విజయనగరం ఆర్డీవో, విజిలెన్స్ అధికారుల బృందం బాణసంచా దుకాణాలున్న మిగతా 10వ పేజీలో...

బాణసంచా దుకాణాల సమీపంలో స్తంభించిన ట్రాఫిక్





ప్రత్యేక ఓటరు నమోదుపై సూచనలిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

జిల్లాలో 15,64,530 ఓటర్లు

● ముసాయిదా జాబితా విడుదల ● పెరిగిన ఓటర్ల సంఖ్య 23,529
● జనవరి 6న తుది జాబితా

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఓటర్ల ముసాయిదా జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆ ప్రకారం జిల్లాలో 15,64,530 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన జాబితా ప్రకారం 15,41,001 ఉండగా తాజా లెక్కల ప్రకారం 23,529 మంది పెరిగారు. కొత్తగా ఓటు హక్కు 32,873 మంది పొందగా 9344 మందిని తొలగించారు. అర్హులైన వారు ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం ద్వారా ఓటు హక్కు కోసం సంప్రదించవచ్చు. నవంబరు 9,10,23,24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేకంగా ఓటు నమోదు ప్రక్రియను ఎన్నికల సంఘం చేపడుతోంది. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబరు ఒకటిలోగా పరిష్కరిస్తారు.

జనవరి 6న తుది జాబితా విడుదల చేయనున్నారు. ప్రత్యేక ఓటరు నమోదుపై డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



8లో

కమనీయం.. ఉయ్యాల కంబాల ఉత్సవం

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల ఉత్సవం మంగళవారం ఎంతో వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు వేకువజామునుంచే ఆలయానికి పోటెత్తారు. పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజు, పూజారి బంటుపల్లి వెంకటరావులు పైడిమాంబను ఉయ్యాలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇదేం పని 'గురు'

● బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు
● కొండవెలగాడ పాఠశాలలో ఘటన ● పోక్సోకేసు నమోదు.. అరెస్టు



నిందితుడు వెంకటరావుదొర

నెల్లిమర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారే బుద్ధి తక్కువ పని చేశారు.. సన్మార్గం వైపు తీసుకువెళ్లాల్సిన వారే వక్రమార్గం పట్టారు. ఓ విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించి కటకటాలపాలైన ఘటన నెల్లిమర్ల మండలం కొండవెలగాడ ఉన్నత పాఠశాలలో మంగళవారం వెలుగుచూసింది. ఆ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.వెంకటరావుదొరపై పోక్సో కేసు నమోదైంది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ వివరించారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక పట్ల ఉపాధ్యాయుడు వెంకటరావుదొర తరచూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. బాలిక వీపు పైన, భుజాల పైన తాకుతూ పైశాచిక ఆనందం పొందుతున్నాడన్నది బాలిక తల్లి ఆరోపణ. మూడు రోజులుగా ఆ బాలిక ఇంటి వద్ద మౌనంగా ఉండడంతో తల్లి అసలు విషయంపై ఆరా తీసింది. ఉపాధ్యాయుడు అసభ్య ప్రవర్తన గురించి వివరించింది. దీనిపై తల్లి మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లి నిలదీయడంతో పాటు నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో వెళ్లి ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్ఐ బి.గణేష్ సిబ్బందితో పాఠశాలకు వెళ్లి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయుడు జ్ఞాన శంకర్‌తో మాట్లాడారు. నిందితుడు ఉపాధ్యాయుడు వెంకటరావును అదుపులోకి తీసుకుని నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ ఉపాధ్యాయుడు మద్యం సేవించి విధులకు హాజరవుతుంటాడని, పిల్లలను ఎప్పటికప్పుడు క్రమశిక్షణ పేరుతో ఉద్దేశపూర్వకంగా గట్టిగా కొడుతుంటాడని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం కొండవెలగాడ జడ్పీ పాఠశాలలో విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు ఎం.వెంకటరావు దొర అసభ్యంగా ప్రవర్తించినట్లు డిప్యూటీ డీఈవో విచారణలో నిర్ధారణ అయ్యిందని పేర్కొంటూ ఆయనను సస్పెండ్ చేస్తున్నామని డీఈవో మాణిక్యం నాయుడు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు విద్యార్థినులను భౌతికంగా హింసించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారించామని తెలిపారు.

పొదుపు మంత్రం.. తెలిస్తే అద్భుతం

● ఆర్థిక భద్రత కోసం తపన ● డబ్బు ఆదా కోసం సురక్షిత మార్గాల అన్వేషణ
● స్టాక్ మార్కెట్‌లపై పెరుగుతున్న అవగాహన
● నేడు ప్రపంచ పొదుపు దినోత్సవం





"విజయనగరానికి చెందిన రాంబాబు అనే ప్రభుత్వ ఉద్యోగికి రూ.70 వేలకుపైగా వేతనం అందుతోంది. ఇంటి అవసరాలు, పిల్లల చదువుకు నెలకు సగటున రూ.30 వేలు ఖర్చవుతోంది. రూ.40 వేల వరకూ మిగులుతోంది. కానీ ఎప్పుడు ఏ అవసరం పడుతుందోనని చెప్పి ఆ డబ్బును ఇంట్లోనే పెట్టుకోవడం అలవాటు చేసుకున్నాడు. సర్వీసు అంతా జీతం డబ్బులు ఇంట్లో దాచుకోవటంతో.. రాంబాబు అక్కడే ఆగిపోయాడు."

"బాబూరావు అనే వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన జీతం రూ.42 వేలు. ఎంతో జాగ్రత్తగా ఖర్చు చేస్తే చేతిలో మిగిలేది ఓ ఇరవై వేలు. కానీ మిగతా మొత్తాన్ని బాగా తెలిసినవారి దగ్గర చిట్టీల్లో పొదుపు చేశాడు.. పొదుపు చేసిన ..డబ్బులను మదుపు చెయ్యటం వల్ల 20 ఏళ్లలో సొంతింటి కలను సాకారం చేసుకున్నాడు.
ఈ ఇద్దరిలో ఒకరు డబ్బులను ఇంట్లోనే ఉంచుకోవటం వల్ల లాభం లేకుండా పోయింది. రెండోవ్యక్తి తెలివిగా మదుపు పెట్టటం వల్ల లాభదయకంగా ముందుగా సాగాడు."

విజయనగరం/ శృంగవరపుకోట/ సాలూరు రూరల్ అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటకు చెందిన ముత్యాలనాయుడు తన సంపాదనలో కూడబెట్టిన రూ.లక్షను బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో జమ చేశాడు. ఏడాదికి రూ. 4వేలు వడ్డీ కలిసింది. డిపాజిట్ చేస్తే దీనికంటే మెరుగ్గా వస్తుందని తెలుసుకున్నాడు. డిపాజిట్‌తో ఏడాదికి రూ.7,500 వడ్డీ కలిసింది. ఇంతకంటే ఎక్కువగా మ్యూచువల్ ఫండ్‌లో పెడితే వస్తుందన్న మిత్రుడి సలహా పాటించాడు. అక్కడ ఏడాదికి రూ.12వేలు వడ్డీ వచ్చింది. ఆయన అంతటితో సంతృప్తి చెందలేదు. ఆ తరువాత స్టాక్ మార్కెట్‌ను ఆశ్రయించాడు. షేర్లలో పెట్టుబడి పెడుతున్నాడు. దీనిలో ఉన్న మెలకువలను తెలుసుకొని నష్టం లేకుండా స్టాక్ మార్కెట్‌లో ఎప్పటికప్పుడు వస్తున్న ఒడుదొడుకులకు అనుగుణంగా వ్యవహరిస్తూ డబ్బును సంపాదిస్తున్నాడు.
..జిల్లాలో ముత్యాలనాయుడు లాంటి వారెందరో ఈ మార్గాలను అనుసరిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో పరిమిత సమయంలో రూ.కోట్లలో అర్జిస్తున్నారు. ఒకప్పుడు పొదుపు అంటే ఖర్చును తగ్గించుకోవడం. పెట్టుబడిలో నష్టభయం (రిస్క్) ఉంటుంది. దీంతో ధనాన్ని ఖర్చు పెట్టకుండా ఉంచుకోవడమే పొదుపుగా భావించేవారు. ఇప్పుడు బ్యాంకులు, పోస్టాఫీసు, జీవిత బీమా వంటి వాటిల్లో రకరకాలుగా పొదుపు పాటిస్తున్నారు. ఈ పొదుపు ద్వారా వచ్చిన మొత్తాన్ని తిరిగి అవే సంస్థల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఏడాదికోసారి వచ్చే వడ్డీని కలుపుకుంటూ దానితో అవసరాలు తీర్చుకోవడం అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు ఈ పరిధిని దాటి కొంత మంది గంటలు, రోజులు, వా రాలు, నెలల్లో లాభాలు తెచ్చిపెట్టే స్టాక్ మార్కెట్‌ల వైపు దృష్టి సారిస్తున్నారు. బుధవారం 'ప్రపం చ పొదుపు దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

ఇక్కడే అలా...

వాస్తవానికి ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు 31న పొదుపు దినోత్సవాన్ని పాటిస్తారు. మన దేశంలో మాత్రం అక్టోబరు 30న జరుగుతుంది. అక్టోబరు 31న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యకు గురవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి వ్యక్తికీ జీవితంతో పొదుపు ప్రాముఖ్యతను నొక్కి చెప్పేందుకు ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నారు.

నిర్వహణా అవసరమే

డబ్బు సంపాదించడమే కాదు... దీని నిర్వహణ కూడా తెలుసుండాలి. భార్యా భర్తలతో పాటు కుటుంబంలో సభ్యులంతా డబ్బు వృథా కాకుండా చూసుకోవాలి. నెలనెలా ఇంటి అవసరాలు, ఖర్చులకు సంబంధించి భార్యాభర్తలిద్దరూ చర్చించుకోవాలి. బడ్జెట్‌ను నిర్ణయించుకోవాలి. అందులో అత్యవసరమైన వాటికే ఖర్చు పెట్టాలి. మిగిలిన మొత్తాన్ని వివిధ పొదుపు పథకాల్లో పెడితే నష్ట భయం ఉండదు. పిల్లల చదువు, పెళ్లి వంటి దీర్ఘకాలిక లక్ష్యాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. టర్మ్ఇన్సూరెన్స్ పాలసీ వంటివి తీసుకోవాలి. ఇవి భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయి. మీరు పెట్టే పెట్టుబడులు, వాటిలోని లాభనష్టాల గురించి నెలనెలా చెక్ చేసుకోవడం మర్చిపోవద్దని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రిటైర్మెంట్ నాటికి చాలా మంది పిల్లల చదువు, పెళ్లి, ఇంటి రుణం, వంటి పెద్ద లక్ష్యాలన్నీ తీరిపోయి ఉంటాయి. దీంతో మిగిలిన మొత్తాన్ని సేవింగ్స్ స్కీమ్, పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, ఎఫ్‌డీ, మ్యూచువల్ ఫండ్స్ వంటి రిస్కు తక్కువగా ఉన్న వాటిలో పెట్టుబడులు పెట్టేందుకు ఎక్కువ మంది ఇష్టపడతారు.



స్టాక్‌మార్కెట్ వైపు చూపు

ఇప్పుడు రెండు పదుల వయసుకే ఐదంకెల జీతం వస్తుండడంతో రిస్కుకు భయపడడం లేదు. పెట్టుబడులకు స్టాక్ మార్కెట్‌లు మంచివని నమ్ముతున్నారు. ఒకప్పుడు స్టాక్ మార్కెట్‌లను పర్యవేక్షించే వ్యవస్థలు ఉండేవి కావు. మోసాలు ఎక్కువగా జరిగేవి. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ వచ్చాక నష్టమంటూ ఉండడం లేదు. ప్రస్తుతం స్టాక్ ఏజెంట్ల వ్యవస్థ పుట్టుకొచ్చింది. వారు సూచించిన షేర్లు కొనడం, లాభాలు వచ్చినప్పుడు అమ్మడం చేస్తున్నారు. దీంతో లాభాలు పొందుతున్నారు. స్టాక్ మార్కెట్ వ్యవస్థలో ఫండ్ మేనేజర్ల పర్యవేక్షణలో మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్కువగా లాభాలు తెచ్చుపెడుతుండడంతో ఎంతోమంది అటువైపు చూస్తున్నారు.స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య పెరుగుతోంది. కంపెనీల పేర్లు, నిలకడతనం, షేర్లు పెరుగుదల వంటివి పట్టికలో ఇస్తున్నారు. యాప్‌లో ఉన్న సులభతర ఇంటర్‌ఫేజ్ కారణంగా షేర్లు ఎలా కొనాలో.. అమ్మాలో తెలిసిపోతోంది.

పెట్టుబడిగా మార్చాలి



పొదుపును పెట్టుబడులుగా మార్చాలి. అప్పుడు తగిన ఫలితం దక్కుతుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో రిస్క్ తక్కువ. వాటిలో పెట్టుబడులు పెట్టవచ్చు. నెలవారీగా పొదుపు చేసుకోవచ్చు. బ్యాంకుల్లో వివిధ పొదుపు పథకాలు ఉన్నాయి.

- పట్లాసింగు పోలిరాజు, ఎస్‌బీఐ మేనేజర్, సాలూరు

అదో తారకమంత్రం



పొదుపు చేసిన డబ్బును తెలివిగా ఆలోచించి.. ఏదైనా వ్యాపారంలో మదుపుగా పెడితే.. భవిష్యత్‌లో లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మనం సంపాదించే దాంట్లో కొంత మొత్తం పొదుపు చేసుకుంటే జీవిత చరమాంకంలో పనికి వస్తుంది. పిల్లల అవసరాలు, చదువులు, వివాహాలు, ఆరోగ్యం గురించి ఉపయోగపడుతుంది. అందుకే పొదుపు పథకాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి. ప్రభుత్వ రంగ సంస్థలైన పోస్టాఫీసు, ఎల్ఐసీలో డిపాజిట్లు చేయాలి. మంచి వడ్డీతో పాటు బీమా పథకాలు సైతం వర్తిస్తాయి. స్టాక్ మార్కెట్లలో సైతం పెట్టుబడి పెట్టవచ్చు.

- కల్లూరి హేమంత్, చార్టర్డ్ అకౌంటెంట్, విజయనగరం



భవిష్యత్తు అవసరాలకు ఉపయోగం



భవిష్యత్తు అవసరాలకు పొదుపు ఉపయోగపడుతుంది. ఆర్థిక భద్రత ఉంటుంది. సంస్థాగత పొదుపుతో తక్కువ లాభాలు ఉంటాయి. నష్ట భయం ఉండదు. షేర్లతో లాభాలు ఎంత ఉంటాయో.. నష్టాలు అదే స్థాయిలో ఉండొచ్చు. వీటి గురించి పూర్తిగా తెలుసుకోవాలి. మనకు నమ్మకం వచ్చాకే పెట్టుబడులకు ముందుకు రావాలి.

- ఎస్ఆర్‌కే రాజు, సహాయ గణాంక అధికారి, శృంగవరపుకోట

స్టాక్ మార్కెట్ శ్రేయస్కరం



జాగ్రత్తలు పాటించి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరం. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉత్తమం. ఇది నష్టభయం లేనివి. ఫండ్ మేనేజర్లను బట్టి వాటిలో పెట్టుబడులు పెట్టాలి. పొదుపు చేసిన మొత్తం దాచుకుంటే ఫలితం ఉండదు. వాటిని సరైన మార్గంలో పెట్టుబడులుగా మళ్లించాలి.

- ఇండుపూరి గున్నరాజు, ఉపాధ్యాయుడు, సాలూరు

పకడ్బందీగా పశుగణన

● పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మన్మథరావు

(జియ్యమ్మవలస)



మాట్లాడుతున్న డాక్టర్ శివ్వాల మన్మథరావు

జిల్లాలో ఇటీవల పశుగణన ప్రారంభమైంది. దీనిని పకడ్బందీగా పారదర్శకంగా చేస్తామంటున్నారు ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ్వాల మన్మథరావు.

ప్రశ్న: జిల్లాలో పశు సంవర్ధకశాఖ పరిధిలో ఉన్న హాస్పిటళ్లు ఎన్ని?

జవాబు: జిల్లాలో పశు వైద్యశాలలు ఏడు ఉన్నాయి. ఇవి సీతానగరం, సాలూరు, పార్వతీపురం, గరుగుబిల్లి, కురుపాం, పాలకొండ, సీతంపేటలలో ఉన్నాయి. అలాగే 37 పశు వైద్య చికిత్సాలయాలు, 24 రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లు ఉన్నాయి.

ప్ర: పశుగణన ఎన్నేళ్లకు ఒకసారి జరుగుతుంది?

జ: ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన జరుగుతుంది. ఇది భవిష్యత్తు ప్రణాళిక, విధాన రూపకల్పనకు ప్రభుత్వానికి కీలకం.

ప్ర: 2019-24 ఆర్థిక సంవత్సరాల మధ్యలో పశు సంపద ఎంత?

జ: జిల్లాలో ఆవు జాతి 2.29 లక్షలు, గేదె జాతి 47 వేలు, గొర్రెలు 2.07 లక్షలు, మేకలు 1.73 లక్షలు, కోళ్లు 8.11 లక్షలు... మొత్తం 14.67 లక్షల పశు సంపద ఉంది.

ప్ర: పశుగణన ఎప్పటి వరకు జరుగుతుంది?

జ: జిల్లాలో పశుగణన అక్టోబరు 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు జరుగుతుంది. మొత్తం 2.34 లక్షల గృహాలను సందర్శించి సర్వే చేయాల్సి ఉంది.

ప్ర: ఎంతమంది సిబ్బందిని వినియోగిస్తున్నారు.

జ: జిల్లాలో ఏడుగురు అసిస్టెంట్ డైరెక్టర్లు, 25 మంది పశు వైద్యాధికారులు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. 296 మందిని ఎన్యూమరేటర్లుగా వినియోగిస్తున్నాం.

ప్ర: దీనికి సంబంధించిన నిబంధనలు ఏమిటి?

జ: జిల్లాలో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లాలి. ముందు ఊరు ప్రొఫైల్ తయారు చేసిన తరువాత ప్రతి రైతు వివరాలు, వారికి సంబంధించిన పశువుల వివరాలు నమోదు చేయాలి. 16 రకాల బ్రీడ్‌లు గణన చేయాలి. అంతా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

కమనీయం.. ఉయ్యాల కంబాల ఉత్సవం



అమ్మవారి ఉత్సవ విగ్రహం

విజయనగరం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల ఉత్సవం మంగళవారం ఎంతో వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు వేకువ జాము నుంచే ఆలయానికి పోటెత్తారు. పం చామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజు, పూజారి బంటుపల్లి వెంకటరావులు పైడిమాం బను ఉయ్యాలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ సందర్భంగా నగరంలో విచిత్ర వేషధారణలతో పండగ వాతావరణం నెలకొంది. పైడిమాంబ దీక్షాదారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పైడిమాంబ ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులంతా బుధవారం చండీ హోమం నిర్వహించనున్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంతో వారు దీక్ష విరమించనున్నారు.

అమ్మవారి జంగిడితో.. →





భక్తురాలిపై అమ్మవారి పూనకం



అమ్మవారికి పూజలు



ఉయ్యాల కంబాలను తిలకిస్తున్న భక్తులు




బోడికొండపై నుంచి రామతీర్థం ఆలయం, పరిసరాలు

రామతీర్థం కొండ.. సోయగాలే నిండా

విజయనగరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రామతీర్థం సీతారాముల ఆలయాన్ని ఆనుకుని ఉన్న బోడికొండ ఎన్నో కమనీయ దృశ్యాలతో కనువిందు చేస్తోంది. ప్రత్యేక సోయగాలతో భక్తులను, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుం టోంది. కొండపైనున్న కొలను మండువేసవిలోనూ నిండుగా ఉంటుంది. అందులో పద్మాలు ముచ్చటగొలుపుతాయి. కొండపై తాబేలు ఆకారంలో గుం తలు, ఎక్కడికక్కడ చెట్లు వింతగా తోస్తాయి. భీముని గృహ సందర్శన ప్రత్యే క అనుభూతిని మిగుల్చుతుంది. ఒక్కోసారి నీలిమేఘాలు మన చెంతకే వ చ్చి పలకరించినట్లు అనిపిస్తుంటుంది. ఈ కొండ ప్రతిబింబం రామతీర్థం ఆలయ కోనేరులో హైక్వాలిటీ కెమెరా ఫొటోలా కనిపిస్తుంది.



భీముని గుహ



కొండపై కొలను



తామతీర్థానికి పర్యాటక గుర్తింపు తెచ్చిన బోడికొండ

అక్షరాస్యత పెంపు సామాజిక బాధ్యత:కలెక్టర్



శిక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్షరాస్యత కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం తన చాంబర్‌లో నవభారత్ సాక్షరత్ కార్యక్రమంపై వయోజన విద్యా శాఖ రూపొందించిన శిక్షణ పుస్తకాలను , వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంను విజయవంతానికి ఎంపీడీవోలు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ స్వయంశక్తి సంఘాల్లో విద్యావంతులైన ఒక్కో మహిళ మరో పది మందికి చదువు నేర్పేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు, జెడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం నింపిన ఎన్టీఆర్: ఎమ్మెల్యే



మెప్మా స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దివంగత సీఎం ఎన్టీఆర్ మహిళల్లో ఆర్థికంగా ఎదగాలనే స్ఫూర్తిని నింపారని.. దానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రోత్సాహాన్ని అందించారని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మహిళా పొదుపు సంఘాలు, మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను మంచి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని చంద్రబాబు అనేక రకాల పథకాలను గతంలో ప్రవేశపెట్టారన్నారు. మెప్మా బజారులో తనకు నచ్చిన కొన్ని వస్తువులను కొనుగోలు చేశారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, కమిషనర్ లాలం రామలక్ష్మి, వైస్‌చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, గొలగాని రమాదేవి, మెప్మా టీపీఆర్ఓ జగన్మోహనరావు, సీఎంఎం వేణుగోపాల్, సీఓలు పోలినాయుడు, సింహాచలం, వరలక్ష్మి, అరుణజ్యోతి, ఆర్‌పీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

స్థానిక తాండ్రపాపారాయ జంక్షన్‌లో గల చెత్త డంపింగ్ తొట్టిలను తొలగించి దాని స్థానంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం సాయంత్రం పరిశీలించారు. చెత్తబుట్టలను అక్కడి నుంచి వేరే చోటకు తరలించాలని, తాండ్రపాపారాయ జంక్షన్‌లో సుందరీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పాత జవహర్ మున్సిపల్ పాఠశాల భవనాన్ని వారం రోజుల్లో గ్రంథాలయానికి అప్పగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, కౌన్సిలర్లు రాంబార్కి శరత్‌బాబు, గెంబలి శ్రీనివాసరావు, కాకల గోవిందమ్మ, పసుపురెడ్డి లక్ష్మణరావు, శ్రీధర్, కాకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభం: మంత్రి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేసే కార్యక్రమం ప్రారంభమైందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లుకు బుకింగ్ ప్రారంభమవుతుందన్నారు. దీనిని సీఎం చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో నవంబరు1న ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని మంత్రి శ్రీనివాస్ సూచించారు.

నైపుణ్య గణనకు సిద్ధం కావాలి:జేసీ

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య గణన 2024 నిర్వహించేందుకు సిద్ధం కావాలని జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. స్కిల్ సర్వే నిర్వహణకు మండలాల నుంచి ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్లకు మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ ఇచ్చారు. జేసీ మాట్లాడుతూ నైపుణ్య గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని మండలాల సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అన్ని శాఖల అధికారులతో పీఆర్‌డీ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు వేగ వంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈ పి.ఢిల్లేశ్వరరావు, పరిపాలనా అధికారి సుబ్బారావు, ఈఓపీఆర్‌డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

జామి, అక్టోబరు 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పంపిణీ వచ్చే నెల 2నుంచి ప్రారంభమవుతుందని పౌర సరఫరాల డీటీ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. దీనిపై మహిళా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సచివాలయం మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. గ్యాస్ కంపెనీల వద్ద చాలా వరకు లబ్ధిదారుల పేర్లు, ఫోన్ నెంబర్లు ఉన్నాయని తెలిపారు. కేవలం ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవాలన్నారు. రూ.810 చెల్లిస్తే...తిరిగి 48 గంటల్లో వారి అకౌంట్‌లకు తిరిగి ప్రభుత్వం నగదు బదిలీ చేస్తుందన్నారు.

ఐక్యతతోనే శిష్టకరణాల అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథ్‌ప్రసాద్

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శిష్ట కరణాల ఐకత్యతోనే అభివృద్ధి సాధ్యమని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు అన్నారు. మంగళవారం బృందావనం అపార్ట్‌మెంట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో శిష్ట కరణాల కుటుంబ సభ్యులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా ఐక్యతతో ఉంటే ఓబీసీలో చేర్చేందుకు పోరాడవచ్చని అన్నారు. సంఘ గౌరవ అధ్యక్షులు త్రినాథ్ ప్రసాద్ మాట్లాడుతూ నవంబరు 24న సారిపల్లి సమీపంతో భీమేశ్వర ఆలయం ఎదురుగా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సంజీవరావు, బలివాడ వెంకటరమణారావు, అరసాడ ప్రసాదరావు, రేగ సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

లక్కవరపుకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి ఎస్.కోట మండలం రేగపుణ్యగిరి గ్రామస్థులు మంగళవారం ఎల్.కోటలో గల ఆమె నివాసంలో వినతిపత్రం అందజేశారు. గ్రామానికి రోడ్డు కావాలని, పక్కా ఇళ్లు ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రేగపుణ్యగిరి గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పి.సాయిరాం, రాజేంద్ర, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోవుల తరలింపును అరికట్టాలి

దత్తిరాజేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెదమానాపురం సంత నుంచి అక్రమంగా గోవులు తరలించకుండా నివారించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఫిర్యాదు చేసినట్టు గజపతినగరం అసెంబ్లీ కన్వీనర్ సరిది దుర్గాప్రసాద్ తెలిపారు. సంత పరిధిలో విధులు నిర్వహించే పంచాయతీ శాఖ, పోలీసు, సంత నిర్వాహకులను విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నెలిమర్ల కన్వీనర్ బూర్లె శ్రీధర్, జిల్లా కార్యదర్శి మజ్జి రమేష్‌బాబు, బీజేపీ చీపురుపల్లి అసెంబ్లీ కో కన్వీనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

రాజాం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని కల్యాణ మండపంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. రాజాం రూరల్ సి.ఐ. ఉపేంద్రరావు సతీమణి లావణ్యతో పాటు రక్తదానం చేసిన 43 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ అధ్యక్షులు సాయి ప్రశాంత్ కుమార్, ప్రతినిధి చైతన్య, సీఐలు కె.ఎ.కుమార్, ఉపేంద్రరావు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాల గుర్తింపు

డ్రోన్ సాయంతో పట్టణంలో ప్రమాద స్థలాలను గుర్తించేందుకు రాజాం పోలీసులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డీఎస్పీ రాఘవులు సారథ్యంలో మంగళవారం చీపురుపల్లి రోడ్డులోని గాయత్రీ కాలనీ సమీపంలో పోలీస్ శాఖ సమకూర్చిన ప్రత్యేక డ్రోన్‌ను ఎగురవేశారు. ప్రమాదరకమైన మలుపులను గుర్తించారు. పాలకొండ రోడ్డులోని గురవాం జంక్షన్, బొబ్బిలి రోడ్డులోని కంచరాం, శ్రీకాకుళం రోడ్డులోని అంతకాపల్లిని ప్రమాదస్థలాలుగా గుర్తించినట్టు ఆయన వెల్లడించారు.

హుండీ ఆదాయం రూ.3.10 లక్షలు

స్థానిక నవదుర్గ అమ్మవారికి హుండీల ద్వారా రూ.3,10,170 ఆదాయం సమకూరింది. భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలకు సంబంధించిన హుండీలను మంగళవారం లెక్కించారు.

నిందితులను శిక్షించండి

వేపాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని మూడున్నరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన దోషిని కఠినంగా శిక్షించాలని మండల మాల మహానాడు నాయకులు దేబారిక కిరణ్ , మరియాదాసు, బంగారయ్యలు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మరే ప్రాంతంలోనూ ఇలా జరగకుండా ఉండేలా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

న్యూస్ బాక్స్

నేడు కవితా పోటీలు

విజయనగరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కవితలను ఆహ్వానించి బుధవారం పోటీలు నిర్వహించనున్నట్టు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఆరు ఉత్తమ కవితలను ఎంపిక చేసి గురజాడ కవితా పురస్కారంతోపాటు, నగదు బహుమతి అందించనున్నట్టు తెలిపారు. కవితా వస్తువు ఏదైనా నేటి సమాజాన్ని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. గత ఏడాది బహుమతి గ్రహీతలు పాల్గొనరాదని తెలిపారు. అనువాదాలు, అనుసరణలు, గతంతో ప్రచురితమైనవి పంపరాదన్నారు. ఒకరు ఒక కవితనే 9441427386 మొబైల్ నెంబర్‌కు పంపించాలని తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

బొబ్బిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై తీర్మానాలు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

వలంటీర్లను గుర్తించాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు అందేలా శ్రమించిన వలంటీర్లను గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులకు సచివాలయాల వద్ద ఆవేదనతో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2.6 లక్షల మంది వలంటీర్లకు సీఎం చంద్రబాబు నాయుడు న్యాయం చేస్తారనే ఆశతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల ప్రతినిధులు ఎ.రవీంద్ర, అచ్యుత కుమారి, మోహన్ ఆదిత్య, మణికంఠ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు వద్దు



ఎస్ఐ ప్రసాద్

రామభద్రపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెలమల ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించవద్దని ఇప్పటికే సూచించామని తెలిపారు. దీపావళి సందర్భంగా అనుమతి లేకుండా టపాసులు విక్రయించరాదని అన్నారు..

చర్యలు తప్పవు

సంతకవిటి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి బెల్టుషాపులు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ గోపాలరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాపుసోంపురం సమీపంలో సర్వే నెంబర్ 22/1లో ఉన్న 30సెంట్ల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను మంగళవారం సాయంత్రం వీఆర్‌వో కృష్ణ, పంచాయతీ కార్యదర్శి బంగారునాయుడు ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా వీఆర్‌వో మాట్లాడుతూ ఇక్కడ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు ఉన్నట్లు తమ దృష్టికి రావడంతో తొలగించామన్నారు.

బాధితులకు సాయం

బొండపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యాతపేట వీధిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మంగళవారం తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడు పట్నాన అప్పన్నకు రూ.3వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు.

మద్యం దుకాణం వద్దు

శృంగవరపుకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం మార్కెట్ ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టకుండా చూడాలని గౌరీశంకర్ కాలనీ వాసులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో అంగన్‌వాడీ, దేవాలయం ఉన్నాయని.. ఇది వివాదస్పద ప్రాంతమని తెలిపారు. ఇటువంటి చోట మద్యం దుకాణం పెట్టకుండా చూడాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దారు భరత్‌కు వినతిపత్రం ఇచ్చారు.

రైలుకు హాల్ట్

కొత్తవలస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జనసాధారణ ప్రత్యేక రైలుకు కొత్తవలస రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించినట్టు సీనియర్ కమర్షియల్ అధికారి ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం నుంచి భువనేశ్వర్ మధ్య జనసాధారణ ప్రత్యేక రైలు(08536-35)ను నవంబరు 15 వరకు నడపనున్నట్టు తెలిపారు.

ఆకట్టుకున్న ఓపెన్‌హౌస్

గరివిడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. పోలీసులు వాడే ఆయుధాలు, పరికరాల గురించి తెలిపారు.

క్రైం కార్నర్

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

గజపతినగరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌ను చోరీ చేసిన సంఘటనల్లో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయనగరం పట్టణంలో నివాసం ఉంటున్న జన్నిరాంసింగ్, హరి ప్రీతిసింగ్‌లు గజపతినగరం, ఆంధ్ర, బొండపల్లి, భోగాపురం, ఎస్.కోట, బూర్జివలస గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలో విలువైన కాపర్ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. దీనిని విజయనగరంలో గల స్క్రాప్ షాపు యజమాని శేఖర్‌కి విక్రయించినట్లు తెలిపారు. షాపు యజమాని నుంచి 255 కిలోల కాపర్‌ను, నిందితుల నుంచి రూ.50వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై గతంలో వివిధ పోలీసు స్టేషన్లలో 29 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారని వెల్లడించారు. సీఐ, రమణ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో ఎస్ఐ కె.లక్ష్మణరావు, ఏఎస్ఐ గోపి, సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణలను డీఎస్పీ అభినందించారు.

అక్రమ మద్యం స్వాధీనం

విజయనగరం క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం చింతలవలస గ్రామ శివారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజశ్రీ తెలిపారు. నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం విజయనగరం సర్కిల్- 2 (రూరల్) పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరి అరెస్టు

బొబ్బిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎ.వెలగవలస గ్రామానికి చెందిన జక్కు లక్ష్మణరావు రూ.4 వేలు విలువ చేసే 28 మద్యం సీసాలను తరలిస్తుండగా పాతబొబ్బిలి జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. అలాగే గొల్లపల్లికి చెందిన వాండ్రాసి సత్యనారాయణ రూ.3,900 విలువ చేసే 28 మద్యం సీసాలను తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. వీరిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

బాణసంచా గోడౌన్ తనిఖీ

జామి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జట్టేడివలస గ్రామం వద్ద ఉన్న దీపావళి సామాన్లు అమ్మే గోడైన్‌పై జిల్లా తూనికలు, కొలతల శాఖల అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఎస్ఐ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో గౌడౌన్ పరిశీలించారు. వస్తువులపై ఎమ్మార్పీలు లేవని, కొన్ని వస్తువులపై ఎమ్మార్పీలు కనిపించకుండా చేశారని, బరువుల్లో తేడాలు ఉన్నాయని గుర్తించారు. దీంతో పలు వస్తువులను వీరు స్వాధీనం చేసుకున్నారు.

చీరకు నిప్పంటుకుని మహిళకు గాయాలు

బాడంగి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చీరకొంగుకు నిప్పంటుకొని మహిళకు గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మల్లంపేట గ్రామానికి చెందిన పట్నాన శివకుమారి (55) మంగళవారం కర్రల పొయ్యిపై వేడినీళ్లు కాచుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు చీర కొంగుకు నిప్పంటుకొంది. వెంటనే స్పందించిన బాధితురాలిని ఆమె తల్లి ఇరుగు పొరుగు వారి సాయంతో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై గ్రామస్థుల ఆందోళన



పోలీసు స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

కొత్తవలస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువతి అదృశ్యం కేసుకు సంబంధించి అప్పన్నదొరపాలెం గ్రామస్తులు మంగళవారం కొత్తవలస పోలీస్ స్టేషన్ ముందు ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన యువతి ఆదివారం అదృశ్యమైంది. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు దర్యాప్తును ఎస్ఐ సుదర్శనరావుకు అప్పగించారు. ఇంతలో గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. యువతిని రక్షించాలని, కలెక్టర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలని ధర్నా నిర్వహించారు. ఒకానొక సమయంలో కొద్దిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో సీఐ షణ్ముఖరావు, సుదర్శనరావు గ్రామస్తులను, అదృశ్యమైన యువతి తల్లిని స్టేషన్‌లోకి పిలిపించి నచ్చజెప్పారు. తమ సిబ్బంది అన్ని కోణాలలోనూ దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు. రాయల సీమ ప్రాంతంలో ఉన్నట్టు సమాచారం వచ్చిందని.. దర్యాప్తునకు సహకరించాలని కోరారు.

పోలీసు బందోబస్తు మధ్య మండల సమావేశం



ఎంపీడీఓ ఆఫీసు వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు

రేగిడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంజూరైన 130కి పైగా ఉపాధి పనుల నిర్వహణలో పంచాయితీ తీర్మానం లేకుండా మెండర్లను నియమించడం తీవ్ర చర్చకు దారితీసింది. రేగిడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. గత సమావేశాల్లో సభ్యులు కానివారు హంగామా చేయడం.. అధికారులను ఇబ్బంది పెట్టే చర్యలకు దిగడంపై అధికార పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. సభ్యులు కాని వారిని స్థానిక ఎస్ఐ నీలావతి, సిబ్బంది అడ్డుకున్నారు. ముందుగా వైస్‌ఎంపీపీలు టి.అచ్చంనాయుడు, వి.జగన్మోహన్‌రావు సీట్లు మార్చడం కాసేపు చర్చకు దారి తీసింది. గత సమావేశాల్లో వీరు వేదిక మీద కూర్చోవడం.. ఈసారి సభ్యుల మధ్య కూర్చోవడంపై ఎమ్మెల్సీ విక్రాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల మేరకే ఈ చర్యలు చేపట్టామని ఎంపీడీఓ స్పష్టం చేశారు. ఉపాధి పనుల విషయంలో సర్పంచ్‌లను విస్మరించటం సరికాదని ఎమ్మెల్సీ విక్రాంత్‌తో పాటు వైసీపీ మద్దతు సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీడీఓ శ్యామలాకుమారితో వాగ్వాదానికి దిగారు. తీర్మాణం లేకుండా ఏ హక్కుతో జాబితాలు పంపుతారని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. దీనిపై కోడిశ, ఉంగరాడ టీడీపీ మద్దతు సర్పంచులు గురవాన రమేష్, చల్ల శోభారాణిలు అడ్డు తగిలారు. అప్పట్లో వైసీపీ హయాంలో చేసినట్టే ఇప్పుడు పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్సీతో వాదనకు దిగారు. ఈ క్రమంలో ఉంగరాడ సర్పంచ్ శోభారాణిపై సమావేశం చివరిలో ఎమ్మెల్సీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జరిగిన 10వేల బస్తాల సిమెంట్ అవకతవకలు, ఏఈ ఆత్మహత్య చేసుకోవటం... ఈ నేపథ్యంలో అప్పటి విచారణ ఏమైందని ఉంగరాడ సర్పంచ్ శోభారాణి, కోడిశ సర్పంచ్ గురువాన రమేష్‌లు సభలో ప్రస్తావించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎల్లారావు దితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణ తగదు

మండల సర్వసభ్య సమావేశంలో సిమెంట్, ఇతర అవకతవకలపై ప్రశ్నించిన ఉంగరాడ మహిళా సర్పంచ్ చల్ల శోభారాణిపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సభలో వ్యక్తిగత దుషణచేసి కించపరచడం సరికాదని మండల టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్సీ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు కిమిడి అశోక్‌కుమార్, నేతలు దూబ ధర్మారావు, కర్ణేన మహేశ్వరరావు, కోడిశ సర్పంచ్ గురువాన రమేష్, బాధిత సర్పంచ్ భర్త చల్ల భుజంగరావు తదితరులు విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ వైఖరిని ఖండించారు. ఈ సమావేశంలో నేతలు కెంబూరు కోటీశ్వరరావు, పాలూరి రామినాయుడు తదితర్లు పాల్గొన్నారు.

వైసీపీ సర్కారు పాపం

(7వ పేజీ తరువాయి) ఇతరత్రా అంశాలపై డిస్కంలు ప్రతిపాదించినా అప్పట్లో ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయింది. దీంతో అప్పటి సర్దుబాటు చార్జీలను ఇప్పుడు వసూలు చేయాల్సి వస్తోందని కూటమి ప్రభుత్వ చెబుతోంది.

ఇలా వసూలు చేస్తారు..

కొత్తచార్జీలతో యూనిట్ ధర రూ.1.50 పైసలు పెరిగే అవకాశముంది. 30 యూనిట్లలోపు వినియోగిస్తే యూనిట్‌కు రూ.1.90 వసూలు చేస్తుండగా తాజాగా సర్దుబాటు చార్జీలతో అది రూ.3.20కు పెరగనుంది. అలాగే 400 యూనిట్ల వరకూ ఖర్చుచేసే వినియోగదారుడికి ఇప్పటివరకూ యూనిట్‌కు రూ.9.75 వసూలు చేస్తుండగా ఇక నుంచి రూ.12.30 పైసల వరకూ పెరగనుంది. జిల్లాపై రూ.5 కోట్ల భారం పడనుందని విద్యుత్ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

● విద్యుత్ కొనుగోలుకు, విక్రయానికి మధ్య వ్యత్యాసపు ధరను సర్దుబాటు చార్జీల రూపంలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. ఈ క్రమంలో 2022-23 సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌కు రూ.1.50 పైసలు చొప్పున వసూలు చేసుకోవడానికి డిస్కంలకు ఏపీఈఆర్‌సీ అనుమతిచ్చింది. జిల్లాలో 5,89,988 మంది గృహ విద్యుత్ సర్వీసులు వున్నాయి. నెలకు 268 కోట్ల యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఈ మొత్తం యూనిట్లపై 2022-23 సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌పై రూ.1.50 పైసలు అదనంగా వసూలు చేయనున్నారు.

పొంచి ఉన్న ముప్పు

(7వ పేజీ తరువాయి) ప్రాంతాన్ని పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. అయినా మంగళవారం ఉదయం 11గంటల వరకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. తరువాత ఏమైందో కానీ తాత్కాలిక ప్రాతిపదికన రిటైల్ దుకాణాల ఏర్పాటుకు అధికారులు ఇష్టారాజ్యంగా అనుమతులు మంజూరు చేశారు. కనీసదూరం, భద్రతా చర్యలు పాటించకుండానే హడావుడిగా దుకాణాలు తెరిచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాణసంచా దుకాణాలపై కేసులు

విజయనగరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదరనాయుడు ఆధ్వర్యంలో విజయనగరంలోని కేఎల్‌పురం, జామి మండలంలో ఏడు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించగా ప్యాకింగ్‌లపై తేదీలు, విక్రయ ధర లేకపోవటం, ధరలు మూసి ప్రత్యేక స్టిక్కర్ అంటించటం, కంపెనీ చిరునామాలు లేకపోవటం గుర్తించి కేసులు నమోదు చేశారు.

ప్రతి పంచాయతీలో ఆట స్థలం

● గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 29: ప్రతి పంచాయతీలో రెండెకరాల ఆట స్థలం నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారని గిరిజన,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం పిట్టాడ, జిటిపేటలో సీసీరోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. జిటిపేటలో ఆర్బీకే ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో రూ.20 కోట్లు సీసీ రోడ్లు, కాలువల అభివృద్ధి పనులకు మంజూరుచేసినట్లు చెప్పారు. స్థానిక నదులు, వాగుల నుంచి ఇసుకను నాటుబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తే అభ్యంతరం చెప్పవద్దని పోలీసులను కోరారు. ఇసుక ఉచితమని పోగులుచేసి లారీలతో తరలిస్తే కేసులు తప్పవనిహెచ్చరించారు.ఆగూరు వద్ద చంపావతినదిపై వంతెనకు, పిట్టాడ పైడి తల్లమ్మ గుడి ప్రహరీకి నిధులు మంజూరుకు హామీఇచ్చారు. పోడుపట్టాలు సిద్ధం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావును మంత్రి ఆదేశించారు. ఆండ్ర జలాశయం కాలువలు నుంచినీరందడంలేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకురాగా కాలువలు అభివృద్ధికి అంచనా రూపొందించి మూడురోజుల్లో నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఇద్దనవలసకు చెందిన దివ్యాంగుడు గవిరెడ్డి ఈశ్వరరావు తనకు ట్రైసైకిల్ మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశాడు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, పీఆర్‌డీఈఈ డీవీఎస్ ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, నాయకులు రెడ్డి ఆదినారాయణ,జి అన్నవరం,రెడ్డి పార్వతి,చొక్కాకు సన్యాసినాయుడు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సభ్యత్వంపై అవగాహన కల్పించండి

● నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు



సభ్యత్వ నమోదు కార్యక్రమంపై వివరిస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతుబంగార్రాజు కార్యకర్తలను కోరారు.మంగళవారం ముక్కాంలోటీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ప్రజలకుఅవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గనగళ్లబాలాజీ, నాయకులు బడినాయుడు, గరికిన చినరాము, అప్పన్న పాల్గొన్నారు.

●గంట్యాడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వం నమోదుకు ప్రతి కార్యకర్త ముందుకురావాలని టీడీపీమండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు కోరారు. గంట్యాడలోటీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలోనినాయకులు అప్పలనాయుడు, జి.శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా తౌడు

నెల్లిమర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నెల్లిమర్ల మండల కమిటీ అధ్యక్షుడిగా లెంక తౌడు ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ జి.శంకర్ జగన్నాథం ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.సంఘం కార్యదర్శిగా కాసిన బంగార్రాజు, ఉపాధ్యక్షురాలిగా పి.శ్రీదేవి, కోశాధికారిగా ఆర్.సురేష్, సంయుక్త కార్యదర్శిగా ఎ.సంతోష్‌కుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్.మోహనరావు, ఎం.సత్యం,ఎం.వెంకటరావు, డి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

బెల్ట్‌షాపులపై సమాచారం ఇవ్వండి: సీఐ

భోగాపురం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా, నిర్వహణకు వేలం పాటలు నిర్వహించినా పోలీసులకు సమాచారం అందజేయాలని సీఐ ఎన్.ప్రభాకరరావు కోరారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయాల మహిళా పోలీసులతో సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతి లేకుండా బాణసంచా అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.పాపారావు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపులను నియంత్రించాలని ఎస్ఐ బి.గణేష్ కోరారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెల్ట్‌షాపుల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రమాద స్థలాలను గుర్తించిన పోలీసులు



డ్రోన్ కెమెరాతో ప్రమాద స్థలాలను గుర్తిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

డెంకాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఏయే ప్రాంతాలు, కూడళ్లలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి, వాటికి గల కారణాలను డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడుసిబ్బందితో మంగళవారం డ్రోన్‌కెమెరాను ఉపయోగించి పరిశీలించి గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవలసవద్ద గలటోల్ ప్లాజా, విజయనగరం నుంచి విశాఖ వెళ్లే ప్రధానరహదారి అయినాడ జంక్షన్, జొన్నాడ, మోదవలసలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు.

కట్టర్లు విరిగి.. వాహనం ఒరిగి

● పార్వతీపురంలో వాహనాల రాకపోకలకు అంతరాయం



గుంతలో దిగబడడంతో కటర్టు విరిగి పక్కకు ఒరిగిన లారీ

పార్వతీపురంటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని బైపాస్ రహదారిలో ఏర్పడిన గుంతలో దిగబడిపోయిన భారీ వాహనం కటర్లు విరిగిపోవడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మంగళవారం ఉదయం విశాఖ నుంచి చత్తీస్‌గడ్‌లోని రాయపూర్‌కు ఇనుము తయారీ ముడిసరుకును తీసుకువెళ్తున్న వాహనం బైపాస్ రహదారిలోని గుంతలో దిగబడిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు నిలిచిపోకుండా దారిమళ్లించారు. కాగా బైపాస్ రహదారిలో ఏర్పడిన భారీ గుంతవద్దఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి, జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు బైఠాయించి నిరసన తెలిపారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని కోరారు.

అభివృద్ధిని ఆపితే ఉపేక్షించేది లేదు

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

బలిజిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను ఆపాలని ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పేర్కొన్నారు. మంగళవారం బలిజిపేట మండలపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదపెంకిలో కాలువలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రూ.మూడున్నర కోట్లు మంజూరు చేశారన్నారు. పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వి ద్యాశాఖాధికారి సింహాచలానికి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఉపాధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిపించాలని సర్పంచ్‌లు, ఎంపీ టీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తూ నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమని పెద్దింపేట సర్పంచ్ అలజంగి జయప్రకాష్ ఎమ్మెల్యేను ప్రశ్నించారు.ఎమ్మెల్యే నుంచి ఆశించిన సమాధానం రాకపోవడంతో వైసీపీకి చెందిన 20 మంది సర్పంచ్‌లు, 15 మంది ఎంపీ టీసీలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జడ్పీ టీసీ అలజంగి రవికుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.

● బెలగాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) :పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంలోని పోలీస్ బ్యారక్‌లో ఎమ్మెల్యే సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం రెండో రోజు కొనసాగింది. వైద్య శిబిరాన్ని ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, డీఎస్పీలు తదితరులు పర్యవేక్షించారు.

నేడు మునిసిపల్ సమావేశం

సాలూరు,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సమావేశానికి అధికారులు, కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

8న మందిరం కోసం శంకుస్థాపన

పాలకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో ఏలాం సెంటర్‌లో నవంబరు 8న రామమందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని పాలకొండ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పల్లా కొండలరావు తెలిపారు. మంగళవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

సీతంపేట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ విద్యనభ్యసించి లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఎంఈవో-2 దిబ్బ సూర్యచంద్రరావు కోరారు. మంగళవారం మండలంలోని పెద్దూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్య క్రమంలో పాఠశాల హెచ్‌ఎం సవర ప్రసాద్, ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు పాల్గొన్నారు.

తోటపల్లిలో హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో మంగళవారం హుండీలను ఈవో వీవీ సూర్యనారాయణ సమక్షంలో లెక్కించారు. 110 రోజులకు వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తుల నుంచి కానుకల రూపంలో రూ. 3,19,366లు, కోదండరామస్వామి ఆలయానికి రూ. 19,163లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఎం.ప్రసాద్, తోటపల్లి ఏపీజీవీబీ బ్యాంకు క్యాషియర్ బి.మాధవి, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బెండపంటకు నష్టం

గరుగుబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దూరులో గుర్తు తెలియని వ్యక్తి రసాయనిక ఎరువులు పిచికారీ చేయడంతో తాము ఎకరా పొలంలో సాగుచేసిన బెండ పంట పాడయ్యిందని గంట శంకరరావు, భవిరెడ్డి ఎరకయ్యలు మంగళ వారం వాపోయారు. పంట కాపునకు వస్తున్న సమయంలో ఈ సంఘటన నెలకొనడంతో సుమారు రూ. 2 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోయారు. అప్పుచేసి కూరగాయల పంటలను సాగు చేస్తున్నామన్నారని తెలిపారు.ఈ విషయంపై ఏవోఆర్.విజయభారతి, సచివాలయ వీపీఏ డి.తులసికి తెలియజేశామని చెప్పారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

పార్వతీపురంలో వాహనాల తనిఖీలు

పార్వతీపురంటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా వెళ్లే ప్రతి వాహనాన్ని మంగళవారం తెల్లవారు జాము నుంచి ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నదే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

పాలకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి పోవద్దని పాలకొండ ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎం సూర్య నారాయణ సూచించారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పాక్షికంగా కూలిన జీసీసీ కార్యాలయం భవనం



గోడ కూలిన దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలోని జీసీసీ కార్యాలయ భవనం మంగళవారం తెల్లవారుజామున పాక్షికంగా కూలింది. రాత్రి సమయం కావడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ భవనం 1964లో నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడే సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేస్తున్న సమయంలోనే పాత భవనం పాక్షికంగా కూలింది. మంగళవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన జిసిసి ఉద్యోగులు భవనం కూలడం పరిశీలించి కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌ను నూతన భవనంలోకి తరలించారు. పాత భవనం కూలిన విషయాన్ని జీసీసీ డివిజనల్ మేనేజర్ డైరెక్టర్లకు సమాచారం అందించినట్టు గుమ్మలక్ష్మీపురం జీసీసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి: డీఎంహెచ్‌వో



ఆసుపత్రిని తనిఖీచేస్తున్న విజయ పార్వతి

కురుపాం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయ పార్వతి కోరారు.మంగళవారం నీలకంఠాపురం పీహెచ్‌సీలో తనిఖీచేశారు. రోగులకు అందుతున్న సదుపాయాల గురించి వైద్యులు అభినవ్‌కుమార్, అమర సింహ రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల్లో విద్యార్థులకు పరీక్షలు జరపాలని, ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా కృషిచేయాలని, గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు.

జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక

పాలకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోమంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 21మంది ఎంపిక య్యారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి అధ్యక్షతన జవహర్ నాలెడ్జ్ కేంద్రం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 93 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.మనోజ్‌కుమార్, జేకేసీ సమన్వయకర్త పి.రాజ్యలక్ష్మి, కోఆర్డినేటర్ బి.రాజు, కళాశాల అధ్యాపకులు ఎం.శాంతి, ఎన్.శంకర్‌బాబు, జి.గురవయ్య. పి.జమ్మయ్య. సీతారాం పాల్గొన్నారు.

పొగాకు పీల్చడంతో కేన్సర్

సాలూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పొగ పీల్చడం, పొగాకు నమలడం వల్ల కేన్సర్ వస్తుందని ఎఫ్‌డీపీ ఎంఎల్‌హెచ్‌పీ పూజ తెలి పారు. చిన్నవలసలో పొగాకు వల్ల సంభవించే దుష్పరిణామాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మానేపల్లి సాయి మురళి, ఏఎన్ఎం స్వర్ల, డిజిటల్ అసిస్టెంట్ జయశ్రీ పాల్గొన్నారు.

త్వరలో చిలకపాలెం-రాయగడ రోడ్డు పనులు

పార్వతీపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిలకపాలెం- రామ భద్రపురం, రాయగడ రహదారి పనులు త్వరలో చేపడుతున్నట్టు ఆర్‌అండ్‌బీ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.రాజేం ద్రకుమార్ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం రూ.100 లక్షలుమంజూరు చేసినట్టు పేర్కొన్నారు. మంగళవారం వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి మధ్యలో గుంతలు పడ్డాయన్నారు. వీటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, టెండర్లు కూడా ఖరారైనట్టు తెలిపారు.

సాలూరు మునిసిపాలిటికి పీఎం స్వానిధి అవార్డు

సాలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సాలూరు మునిసిపల్ కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ మంగళవారం విజయవాడ తుమ్మల కళాక్షేత్రంలో పురపాలకశాఖ మంత్రి నారాయణ చేతులు మీదుగా పీఎం స్వానిధి అవార్డును అందుకున్నారు. సాలూరు మునిసిపాలిటీ లక్ష్యానికి మించి రుణాలు అందించడంతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి పురస్కారాన్ని సొంతం చేసుకుంది.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి

గరుగుబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని జడ్పీ వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు. మంగళవారం రావివలసలో ఉపాధి పథకంలో అభివృద్ధి పనులకు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కోట భరత్‌కుమార్, సర్పంచ్ బి.అప్పుడు, సీహెచ్ దామోదరనాయుడు, ఎం.సత్యనారాయణ, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ జి.అవినాష్, కార్యదర్శి ఆర్.శశిభూషణరావు, పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

పార్వతీపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయం సిబ్బందికి నైపుణ్య గణన- 2024పై జిల్లా స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వహీదా, తాడేపల్లి నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయం అధికారి కార్తీకనాయక్ మంగళవారం ప్రారంభించారు.

శంకుస్థాపనల సమాచారం ఇవ్వండి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు తమకు సమాచారం ఇవ్వాలని వైసీపీ సర్పంచ్‌లు కోరారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో మండల సర్వసభ్య సమా వేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వం అమలుచేయనున్న ఉచిత వంట గ్యాస్‌ను వినియోగించుకోవాలని జీసీసీ సూపరింటెండెంట్ సాంబశివరావు కోరారు. ప్రోటోకాల్ ప్రకారం అధికారులు పనిచేయాలని ఎంపీపీ దీనమయ్య తెలిపారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరుకావాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. సమా వేశంలో జడ్పీటీసీ రాధిక, మండల ఉపాధ్యక్షుడు శేఖర్, ఎంపీడీవో సాల్మన్‌రాజు, తహసీల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

బీఎఫ్‌టీలపై నివేదిక ఇవ్వాలి

మెంటాడ(ఆంధ్రజ్యోతి) అక్టో బరు 29: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో బేర్‌ఫుట్ టెక్నీషియన్లు (బీఎఫ్‌టీ) ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ అంబేద్కర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈమేరకు సమగ్ర విచారణ జరిపి మూడురోజుల్లో నివేదిక సమర్పించాలని డ్వామా పీడీ సందీప్‌ను ఆదేశించారు.ఉపాధి పథకంలో బీఎఫ్‌టీల అతి జోక్యం, తగిన విద్యార్హత లేకపోయినా సంకేతిక పనుల్లో వేలు పెట్టడం,చేతివాటం వంటి అంశాలపై ఈనెల 28న ఆంధ్రజ్యోతిలో బీఎఫ్‌టీలదే ఇష్టారాజ్యం శీర్షికతో కథనం ప్రజురితమైంది. దీంతో స్పందించిన కలెక్టర్ తక్షణ విచారణకు డ్వామా పీడీకి ఆంధ్రజ్యోతి పేపర్ క్లిప్పింగ్‌ను జతపరుస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈనేపథ్యంలో పీడీ రంగంలోకి దిగినట్టు సమాచారం.

పశు వైద్యశాలలు నిర్మించాలి

భోగాపురం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పశువైద్యశాలలు పునరుద్ధరించాలని, కొత్త పశువైద్య శాలలు నిర్మించాలని, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ పోత్సాహానికి అవసరమైన సహాయాన్ని అందించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు.ఈమేరకు మంగళవారం మంగళగిరిలో మంత్రి కింజరాపు అచ్చెంనాయుడును కలిశారు.ఆమెతో పాటు జనసేన నాయకులు ప్రసాదు లోకం, గూడెపువలస సర్పంచ్ మట్ట అయ్యప్పరెడ్డి ఉన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

చీపురుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్ క్లబ్, స్టార్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.వీరిలో 22మందికి తదుపరి పరీక్షలు జరిపి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో బెల్లాన వంశీకృష్ణ, దండు సీతారామరాజు, గంట్యాడ విష్ణుమూర్తి, ఎస్.సన్యాసిరావు పాల్గొన్నారు.

రికార్డుల్లో పేర్లు మార్చడంపై వినతి

భోగాపురం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా వైసీపీ నాయకుడు రికార్డుల్లో పేర్లు మార్చేసి స్థలం కాజేయడానికి పూనుకొన్నారని రావాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం తహసీల్దార్ ఎం.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. తన తల్లి 1976 ఆగస్టు21న రావాడ గ్రామ రెవెన్యూలోగల సర్వే నెంబరు 180లో 37 సెంట్ల జిరాయతీ మెట్ట భూమిని కొనుగోలు చేసిందని, ఆభూమి నేటికి తమ అనుభవంలో ఉందని తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి ఆ భూమి తన పేరు మీద ఆన్‌లైన్ చేయాలని కోరారు.

పీజీసెంటర్ ఏర్పాటు చేయాలి

పాలకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో మెడికల్ కాలేజ్, పీజీ సెంటర్ ఏర్పాటుచేయాలని ఎస్ఎఫ్ఐ మన్యం జిల్లా కమిటీ సభ్యుడు సింహాచలం కోరారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులతో కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు జి.సురేష్, భాస్కరరావు, మండల కమిటీ సభ్యులు ఎస్.రాజు, ఎ.బాలు పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):విద్యారంగ సమస్యలపై నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు వివిధ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ న్విహించారు.